# ఈవీఎంలలో తీర్పు భద్రం!

3న తేలనున్న అభ్యర్థుల భవితవ్యం • గెలుపుపై బీఆర్ఎస్ అభ్యర్థుల్లో పెరిగిన ధీమా

### మెజార్టీపైనే చూపులన్నీ...

సిటీబ్యూరో, నవంబరు 30(నమస్తే తెలంగాణ): గ్రేటర్ ఎన్నికల్లో గెలుపు కోసం సర్వశక్తులు ఒడ్డిన నేతల తలరాతలు ఓట్ల రూపంలో స్ట్రాంగ్ రూముల్లోకి చేరిపోయాయి. గెలుపోటముల భవిష్యత్తు ఈవీఎంలలో భద్రంగా ఉన్నాయి. ఈ నెల 3వ తేదీన జరిగే ఓట్ల లెక్కింపు వరకు అన్ని పార్టీల నాయకుల్లో ఉత్కంఠ తప్పని పరిస్థితి నెలకొంది. పోలింగ్ ముగియగానే ఎన్నికల ఏజెంట్లు, అధికారుల సమక్షంలో బ్యాలెట్ బాక్సులను సీలు చేశారు. వాటిని కేటాయించిన లెక్కింపు కేంద్రాలకు రాత్రికి రాత్రే తరలించి స్ట్రాంగ్ రూముల్లో భద్రపరిచారు. లెక్కింపు కేంద్రాల్లోనే స్ట్రాంగ్ రూములు ఉండేలా చర్యలు తీసుకున్నారు. ప్రతి స్ట్రాంగ్ రూము వద్దా మూడంచెల సాయుధ పోలీసు బలగాలతో భద్రతా చర్యలు చేపట్టారు. రెండు రోజుల పాటు పటిష్టమైన భద్రతను పోలీసులు ఏర్పాటు చేయడం గమనార్హం.

### ప్రశాంతంగా పోలింగ్..

గ్రేటర్ హైదరాబాద్‌లో బుధవారం జరిగిన శాసన సభ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా తమ బాధ్యతను నెరవేర్చారు. ఐతే, ఇన్ని రోజులూ విజయం కోసం కాళ్లు అరిగేలా పాదయాత్రలు.. గొంతులు బొంగురు పోయేటట్లు ప్రసంగాలు.. సభలు, సమావేశాలు నిర్వహించారు. పోలింగ్ ముందు రోజున నాయకులు, అభ్యర్థులు ఆఖరి ఎత్తుగడలకు వ్యూహాలు రచించారు. బస్తీలు, కాలనీల సంక్షేమ సంఘాల నాయకులను, పలుకుబడి ఉన్న వారిని రహస్య ప్రాంతాల్లో



కలిసి మద్దతును కూడగట్టారు. 'మీ కష్టం ఏమీ ఉంచుకోం.. మా కోసం కష్టపడిన వారి మేలును ఎన్నటికీ మర్చిపోం..' అంటూ హామీలిచ్చారు. కొన్ని చోట్ల ఓటర్లను తమ దారికి తెచ్చుకునేందుకు వినూత్న ప్రయోగాలు చేశారు. మొత్తంగా గెలుపోటములపై ఎవరి ధీమా వారిదే అన్నట్లుగా అభ్యర్థులు ఉన్నారు. అభ్యర్థులు తలరాతలు బయట పడాలంటే 3వ తేదీ వరకు వేచి చూడాల్సిందే మరీ !

### గులాబీ మెజార్టీపైనే.. అభ్యర్థుల చూపులన్నీ...

హైదరాబాద్ - రంగారెడ్డి - మేడ్చల్ - మల్కాజ్‌గిరి జిల్లాల పరిధిలో గులాబీ ప్రభంజనం ఖాయంగా కనిపిస్తోంది. దాదాపు 16 స్థానాల్లోనూ గులాబీ జెండా ఎగరవేసే అవకాశాలున్నాయని పార్టీ అంచనా వేస్తోంది. మిగతా స్థానాలు ఎంఐఎం, ఒకటి, రెండు స్థానాలు ఇతర పార్టీలు మినహా మెజార్టీ స్థానాల్లో గులాబీ అభ్యర్థులు గెలుపు ఖాయమని చెబుతున్నారు. హైదరాబాద్ నగరంలో ప్రశాంతత వాతావరణం, సుస్థిర ప్రభుత్వం, బలమైన నాయకత్వం, తొమ్మిదిన్నరేండ్ల అభివృద్ధి వైపే గ్రేటర్ ఓటర్లు మొగ్గు చూపారని విశ్లేషిస్తున్నారు. గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తూనే అభ్యర్థులంతా మెజార్టీ ఎంత వస్తోందోనన్న ఉత్కంఠ నెలకొంది. మొత్తంగా గత ఎన్నికల కంటే ఈ సారి బీఆర్ఎస్ ఓటింగ్ శాతాన్ని మరింత పుంజుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# పెద్ద సంఖ్యలో యువత ఓటింగ్

పోలింగ్ బూత్‌లకు తరలివచ్చిన మహిళలు



సిటీబ్యూరో, నవంబర్ 30(నమస్తే తెలంగాణ): జిల్లాలో నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికలలో యువత నుంచి మంచి స్పందన వచ్చింది. ప్రధానంగా ఐటీ ఉద్యోగస్తులతో పాటు 18 ఏండ్లు నిండిన విద్యార్థిని, విద్యార్థులు కూడా తమ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఓటింగ్‌లో పాల్గొన్నారు. హైదరాబాద్ నగరంలో జరిగిన అభివృద్ధికి యువత పట్టం కట్టారు. ముఖ్యంగా జిల్లా అభివృద్ధితో పాటు యువతను దృష్టిలో పెట్టుకుని ఎన్నో సంక్షేమ పథకాలు సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో ప్రవేశ పెట్టిన అంశం యువతను ఆకట్టుకున్నట్లు చెబుతున్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా 18 ఏండ్లు నిండిన విద్యార్థులు ఎంతో ఓపికగా క్యూలైన్‌లో నిలబడి ఓట్లు వేశారు. జిల్లాలో ఉద్యోగాలు చేస్తూ.. ఉన్నత విద్యలు చదువుకుంటున్న యువతతో కొంత మంది తమ సొంత గ్రామాలకు ఓట్ల కోసం వెళ్లారు. కాని, మిగిలిన యువత ప్రస్తుతం ఎన్నికల పట్ల అవగాహన పెంచుకున్నారు. దీంతో పెద్ద ఎత్తున యువత ఓటింగ్‌లో పాల్గొన్నట్లు తెలుస్తుంది. అలాగే, మహిళా ఓటర్లు కూడా జిల్లాలో ఈ సారి పెద్ద సంఖ్యలో ఓట్లు వేసినట్లు కనిపించింది. ఉదయం ఏడు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కూడా తమ కుటుంబంతో సహ మహిళలు పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చారు. ఎవరి ప్రమేయం లేకుండా, ప్రలోభాగాలకు గురి కాకుండా తమకు కేటాయించి పోలింగ్ బూత్‌లకు వచ్చిన ఓట్లు వేశారు.



# ఎగుమతి ఫైనాన్స్‌లో ఎస్‌బీఐకి పురోగతి




జూబ్లీహిల్స్, నవంబర్ 30: ఎగుమతి ఫైనాన్స్‌లో గణనీయ పురోగతి సాధించి రూ.2.60 లక్షల కోట్ల లావాదేవీలను నిర్వహించిన ఎస్‌బీఐ గతేడాది మార్కెట్ వాటాను కూడా 18 శాతానికి పెంచుకున్నదని అంతర్జాతీయ బ్యాంకింగ్, గ్లోబల్ మార్కెట్స్ అండ్ టెక్నాలజీ ఎండి వల్లా శ్రీనివాసులు శెట్టి పేర్కొన్నారు. బంజారాహిల్స్‌లోని తాజ్ కృష్ణలో ఎస్‌బీఐ హైదరాబాద్ సర్కిల్, కమర్షియల్ క్లయింట్స్ గ్రూప్‌తో కలిసి ఖాతాదారులు, ఎగుమతిదారుల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్లోబల్ మార్కెటింగ్స్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ నంద్ కిషోర్, సీసీజీ డీఎండీ అమితవ ఛటర్జీ ప్రసంగించారు. ఎగుమతి ఫైనాన్స్ రంగంలో ఎస్‌ఎంఈ లను ఏక కాలంలో పర్యవేక్షిస్తూ కార్పొరేట్ల అవసరాలను కూడా తీర్చడంలో గురుతర బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఐఈఓ, ఎఫ్‌టీసీసీఐ, ఈసీజీసీ సంస్థల ఉన్నతాధికారులతో పాటు జీఎం నెట్‌వర్క్-1 మంజుశర్మ, జీఎం ఎన్‌డబ్ల్యూ 2 దేబాశిశ్ మిత్రా, సీసీజీ ఆర్ఓ జీఎం విద్యారాజా, ఎస్‌ఎంఈ డీజీఎం భవనేశ్వరి, ఏజీఎం రామకృష్ణ, ఎస్‌ఎంఈ ఎస్‌సీఎఫ్ సీజీఎం ఏఎస్ పాల్‌తో పాటు 150 మందికి పైగా ఎగుమతిదారులు పాల్గొన్నారు.

# నెట్టింట్లో పార్టీల సందడి

- పోలింగ్ ముగియడంతో 'సోషల్' వేదికగా సంబురాలు
- నచ్చిన అభ్యర్థి గెలుపు ఖాయమంటూ పోస్టులు
- సినిమా వీడియోలతో మీమ్స్



సిటీబ్యూరో, నవంబర్ 30(నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల సమరంలో కీలక ఘట్టమైన పోలింగ్ ప్రక్రియ ముగిసింది. ఇక అభ్యర్థుల భవితవ్యం డిసెంబర్ 3న తెలియనుంది. ఇన్నాళ్లు ఎన్నికల ప్రచారం, ఓటింగ్ వంటి ప్రత్యక్ష పోరు చేసిన కార్యకర్తలు, పార్టీ నేతలు ఇప్పుడు.. సోషల్ మీడియా వేదికగా విజృంభిస్తున్నారు. తమ పార్టీ అభ్యర్థి గెలుస్తాడంటూ కొందరు నెట్టింట్లో విరుచుకుపడుతుంటే.., ఇక అధికారంలోకి వచ్చిందే తమదేనంటూ ఢంకా బజాయించి సోషల్ మీడియాలో దూసుకుపోతున్నారు. ఇక కొందరు ఔత్సాహిక నెటిజన్లు సినిమా క్లిప్పింగులను మీమ్స్‌గా మార్చి తోటి నెటిజన్లతో పంచుకుంటున్నారు. ప్రస్తుతం, ఎన్నికల హడావుడి ముగియడంతో నెటిజన్లుగా వైవిధ్యమైన అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

### సోషల్ మీడియాపై సందడి

అసెంబ్లీ ఎన్నికలు ముగియడంతో సోషల్ మీడియాలో సందడి మొదలైంది. నచ్చిన నేతలతో రూపొందించిన పోస్టులు, మీమ్స్, ఏఐ జనరేటెడ్ పోస్టర్లు నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. ఈ క్రమంలో కొందరు ఉత్సాహవంతులైన పార్టీ నేతలకు సంబంధించిన పోస్టులతో విస్తృతంగా ట్రెండ్ చేస్తున్నారు. వీటికి తోడు ఎగ్జిట్ పోల్ ఫలితాలను పరిగణనలోకి తీసుకుని అధికారంలోకి వచ్చేది తామేనని ప్రచారం చేసుకుంటున్నారు. ప్రస్తుతం, ఎగ్జిట్ పోల్ యాష్ ట్రెండింగ్ అవుతుండగా, దీనికోసం రూపొందించిన పోస్టులు, పోస్టర్లు, మీమ్స్ వంటి వన్నీ కూడా నెటిజన్లను అలరిస్తున్నాయి.

### అంతా సోషల్ మీడియాలోనే..

ఎన్నికల ప్రచారం మొదలైనప్పటి నుంచి తెలంగాణలో నెటిజన్లు యాక్టివేట్ అయ్యారు. ప్రచారం, నామినేషన్లు, రోడ్ షోలు, పోలింగ్ వరకు పార్టీల యాక్టివిటీ మొత్తం సోషల్ మీడియాలోకి చేరింది. పార్టీలు, అభ్యర్థుల వారీగా సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు బరిలో దిగడంతో ఎలక్షన్ కార్యాకలాపాల తీరు మారిపోయింది. పార్టీల వారీగా జరిగిన ప్రచారంలో మెజార్టీ సోషల్ మీడియా వేదికగానే జరిగింది. పోలింగ్ ముగియడంతో పార్టీల వారీగా ప్రచారం చేయడం మొదలుపెట్టారు.

# కారుదే హవా..

- గులాబీకి ఓటు కొట్టి.. సెల్ఫీలు పోస్ట్ చేసి...
- అభివృద్ధికే సై.. అన్న జనం

సిటీబ్యూరో, నవంబర్ 30(నమస్తే తెలంగాణ): ఓటు వేసిన సెల్ఫీని సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసి నెటిజన్లు సందడి చేశారు. అభివృద్ధికే తమ ఓటు వేశామంటూ క్యాప్షన్స్ ఇచ్చారు. కారు మళ్లీ వస్తుందంటూ పోస్టులు పెట్టారు. హ్యాట్రిక్ సీఎం కేసీఆరేనని స్లోగన్స్ ఇచ్చారు. తెలంగాణ మళ్లీ గెలుస్తుందంటూ నెటిజన్లు తమ అభిప్రాయాలను సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. బీఆర్ఎస్ పార్టీదే మళ్లీ అధికారంలోకి రాబోతుందంటూ తమ ఓటు కారుకే వేశామంటూ కొందరు నెటిజన్లు పోస్టులు పెట్టడం విశేషం. మరి కొంతమంది నెటిజన్ల వాట్సప్, ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాలో సైతం తమ ఫొటోలను గులాబీ రంగుతో రూపొందించి షేర్ చేసుకున్నారు. మరోవైపు ఓటు వేసేందుకు ఊళ్లకు వెళ్లిన వారు సైతం జర్నీల ఫొటోలు, మార్గమధ్యలో జరిగిన అభివృద్ధిని సూచిస్తూ పోస్టులు పెట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా నెటిజన్లు అంతా కారుకే జై కొట్టినట్టు సోషల్ మీడియాలో గులాబీ ప్రభంజనం కనిపించింది.